
ఐనవోలు : ఓటు వేసేందుకు బారులుదీరిన పట్టభద్రులు


దామెర: చిన్నారులతో ఓటువేసేందుకు వచ్చిన మహిళలు


ఆత్మకూరు: క్యూలో నిల్చున్న ఓటర్లు

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- ఓటెత్తిన పట్టభద్రులు
- చంటిపిల్లలతో తరలిన మహిళా ఓటర్లు
- భారీ బందోబస్తు నిర్వహించిన పోలీస్‌శాఖ
- పరకాల డివిజన్ వ్యాప్తంగా 74.78 శాతం నమోదైన పోలింగ్

పరకాల : ఖమ్మం, నలగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక సోమవారం ప్రశాంతంగా జరిగింది. పోలింగ్‌శాతం ఉదయం కొంత మందకొడిగా నమోదు అయినప్పటికీ మధ్యాహ్నం 1గంట తర్వాత పుంజుకుంది. మండలంలో 70 శాతం పోలింగ్ నమోదు కాగా డివిజన్ వ్యాప్తంగా 74.78 శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం 4గంటల నుంచి ఓటర్లను అనుమతించకుండా అధికారులు పోలింగ్ ప్రక్రియను పటిష్ఠంగా అమలు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 4 పోలింగ్ బూత్‌ల వద్ద కుర్చీలు వేసి ఓటర్ల పట్ల మర్యాదను చాటుకున్నారు. పోలింగ్ సరళిని ఆర్డీఓ నారాయణ, స్థానిక తహసీల్దార్ భాస్కర్ పరిశీలించారు. అదే విధంగా పోలింగ్ ముగిసిన అనంతరం డీసీపీ పుల్ల రవీందర్ ఆధ్వర్యంలో భారీ భద్రత నడుమ బ్యాలెట్ బాక్స్‌లను సీజ్ చేసి జిల్లా కేంద్రానికి తరలించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

శాయంపేటలో..

శాయంపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతగా ముగిసాయి. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు నిర్వహించినట్లు ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు. అలాగే జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పోలింగ్ సరళిని పరిశీలించారు. స్వతంత్ర ఎంపీ అభ్యర్థి మంద నరేష్ ఓటు హక్కును వినియోగించుకున్నారు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో 1,908 ఓటర్లకు గాను 1,471 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 77.09శాతం ఓటింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ సుభాషిణి తెలిపారు.


దామెర : ఓటింగ్ సమయం ముగిసినా క్యూలైన్‌లో వేచిఉన్న ఓటర్లు


ధర్మసాగర్ : ఓటువేసిన పట్టభద్రులు

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో భాగంగా మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలోని మూడు బూతుల్లో మొత్తం 1,720 మంది పట్టభద్రులు ఓటుహక్కు కలిగి ఉండగా 1,414 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 82.20 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్, ఎన్నికల అధికారి సదానందం పేర్కొన్నారు. సీఐ మహేందర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

వేలేరులో..

వేలేరు : మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుండే పట్టభద్రులు క్యూలైన్‌లో నిల్చొని ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 706 మంది పట్టభద్రులు ఓటుహక్కు కలిగి ఉండగా 561 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 320 మంది పురుషులు, 241 మంది మహిళలు ఓటు వేయగా 79 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. కాగా మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాజీపేట ఏసీపీ తిరుమల్ బందోబస్తును పర్యవేక్షించారు.


శాయంపేట : పసికందుతో వచ్చి ఓటువేసిన మహిళ

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 1,898 మంది ఓటర్లకు 1,492 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 78.5శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని సీపీ అంబర్‌కిషోర్ ఝూ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీసీపీ రవీందర్, ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ క్రాంతికుమార్ ఉన్నారు. కాగా మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. ఈ మేరకు హనుమకొండలో ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.


ఆత్మకూరు : ఓటువేసిన మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి


పరకాల : ఓటు వేసిన మహిళ


శాయంపేట : పర్యవేక్షిస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్

దామెరలో..

దామెర : మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రశాంతంగా ముగిసినట్లు తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి సోమవారం తెలిపారు. మండలంలో ఒకే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళా ఓటర్లు పసిపాపలతో ఓటుహక్కు వినియోగించుకునేందుకు రాగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓటింగ్ సాయంత్రం 4 గంటలకు ముగియాల్సి ఉన్నా క్యూలైన్‌లో వేచివున్న వారికి టోకెన్లు అందించి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. అదే విధంగా కొన్ని ప్రయివేటురంగ సంస్థలు, బ్యాంకులు సెలవు ప్రకటించకపోయినా ఓటు వేసేందుకు పట్టభద్రులు తరలివచ్చారు. మండల వ్యాప్తంగా 1,331 మంది ఓటర్లకు 671 మంది పురుషులు, 336 మంది మహిళలు, మొత్తం 1,007 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోగా 75.65 శాతం ఓటింగ్ నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.


ఆత్మకూరు: సూచనలు చేస్తున్న సీపీ


వేలేరు : బందోబస్తును పరిశీలిస్తున్న ఏసీపీ తిరుమల్


వేలేరులో..

నడికూడలో..

నడికూడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక సోమవారం ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 1,953 మంది పట్టభద్రులు ఉండగా 1,411 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 73 శాతంగా పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. 96వ పోలింగ్ స్టేషన్‌లో ఓ మహిళా ఓటరు ఓటు వేయకముందే వేసినట్లు వేలుకు ఇంకు గుర్తు పెట్టి అధికారులు మర్చిపోవడంతో ఆమె అభ్యంతరం తెలపడంతో అధికారులు పరిశీలించి ఆమెకు ఓటువేసేందుకు అవకాశం కల్పించారు. కొన్ని చోట్ల బీఎల్‌ఓలు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయకపోవడంతో పలువురు ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక మండలంలో సోమవారం ప్రశాంతంగా ముగిసిందని తహసీల్దార్ విక్రమ్ కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా 1,693 మంది ఓటర్లకు 1,298 ఓటు హక్కు వినియోగించుకోగా 76.66 శాతం పోలింగ్ నమోదు అయినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

31లోపు దరఖాస్తు చేసుకోవాలి

శాయంపేట : ఎస్సీ గురుకులాల సొసైటీ పరిధిలోని నాన్ సీఓఈ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 31లోగా గురుకులాల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు రుసుము రూ.100 చెల్లించాలని పేర్కొన్నారు.

ప్రకాశాన్ని వరించిన విశ్వకర్మ లెజెండరీ అవార్డు



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌కు చెందిన పూసాల ప్రకాశంకు విశ్వకర్మ లెజెండరీ అవార్డు వరించింది. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ (ఢిల్లీ) ఆధ్వర్యంలో దేశంలోని ఏడు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన 55 మందిని గుర్తించి విశ్వకర్మ లెజెండరీ అవార్డులు అందజేస్తున్నారు. గత కొన్నేళ్లుగా 'పూసాల వరలక్ష్మి ఫౌండేషన్' పేరుతో పూసాల ప్రకాశం ఎందరో పేద విద్యార్థులకు సాయం అందించడంతోపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు ప్రకాశం చేస్తున్న సేవలను గుర్తించిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వారు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవంలో ప్రకాశంకు అవార్డు అందించి సత్కరించారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరి, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనంద్ మేలు, జీహెచ్‌ఎంసీ స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, సంస్థ ప్రతినిధులు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి



శాయంపేట : మండలంలోని పత్తిపాకలో పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రమాబాయి అంబేడ్కర్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్ ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూలే యువజన సంఘం అధ్యక్షురాడు చెల్పూరి శ్రీకాంత్, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి బాబు రజని, మిథున్, చిన్ను, జయ, శ్యామల, పాపయ్య పాల్గొన్నారు.

నెహ్రూకు నివాళి



భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాయలంలో సోమవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నెహ్రూ ఆశయాలను కొనసాగించాలని కోరారు. నాయకులు అబ్బు ప్రకాశ్‌రెడ్డి, మల్లాజి, చిందం రవి, కృష్ణమూర్తి, సాంబయ్య, భాస్కర్, సుధాకర్‌రావు, కుమారస్వామి పాల్గొన్నారు.

మట్టి తరలించిన వాహనాలు సీజ్

నడికూడ : మండలంలోని ధర్మారం గ్రామ శివారులో గల గార్లచెరువులో ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ రవిరాజు తెలిపారు. ఆదివారం రాత్రి అక్రమంగా మట్టి తరలిస్తున్న పగిడోజు శ్రీను (జేసీబీ డ్రైవర్), నక్క ఎర్రన్న, బోయిన మల్లేష్, బుసా బన్నీ, ఆకుల రాజమహేందర్, పంబాల రాజుపై కేసు నమోదు చేసి జేసీబీ, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కొండగట్టుకు భక్తుడి పాదయాత్ర



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన తీగల రాజు హనుమాన్ దీక్ష తీసుకున్నాడు. దీక్షా విరమణ కోసం ఐనవోలు నుంచి కరీంనగర్ జిల్లా కొండగట్టు ఆంజనేయ క్షేత్రం వరకు పాదయాత్రతో వస్తానని మొక్కుకున్నాడు. ఈ నేపథ్యంలో దీక్షా విరమణ కోసం సోమవారం మండల కేంద్రం నుంచి ఒక్కడే పాదయాత్ర ద్వారా బయలు దేరాడు.

మహిళలు స్వయంకృషితో ఎదగాలి

శాయంపేట : మహిళలు స్వయంకృషితో ఎదగాలని ఎంపీటీసీ బత్తిని రజిని అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ మహిళా సాధికారత ఆధ్వర్యంలో ఫీల్డ్ ఫెసిలిటర్ కల్పన 20మంది మహిళలకు జన శిక్షణ సంస్థాన్ సహకారంతో మూడు నెలల టైలరింగ్ కోర్సును పూర్తిచేసి సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అందరికీ ఆదర్శంగా నిలువాలని అన్నారు. కుట్టుశిక్షణ పొందిన పత్తిపాక మహిళా సంఘం సభ్యులకు జీవనోపాధి కోసం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కుట్టేందుకు ఉపాధి కల్పించడం జరిగిందని అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కుట్టుమిషన్ శిక్షణ అందజేస్తున్న రజని

బాల్యమిత్రుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

దామెర: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసుకున్న మిత్రులు 19 సంవత్సరాల తరువాత దుర్గంపేట్ సమీపంలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సమ్మేళనం ఏర్పాటు చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కంటెయ్య, ఆగయ్య, రమేష్, ప్రసాద్, ఎల్లయ్య, పద్మజ, పరిపూర్ణచారి, కమలాకర్, వేణుగోపాల్, శ్రీనివాస్, జలందర్, నిర్వహణ కమిటీ సభ్యులు సుంకరి రాజు, సునీల్, కొమురయ్య, కార్తీక్, తిరుపతి, సురేందర్, నర్సయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు స్నేహితుల చేయూత

ఆత్మకూరు : తమతో కలిసి చదువుకున్న మిత్రులు వివిధ కారణాలతో మృతిచెందగా వారి కుటుంబాలను స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 1998–99 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన ఎండి.సాదిక్, రంగాపురం శ్రీను, మడిశెట్టి శ్రీను, పెండ్యాల అనిత, పార్శ సరిత ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందారు. కాగా వారి కుటుంబాలను పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. తమతో కలిసి చదువుకున్న తోటి మిత్రులు అనంతలోకాలకు వెళ్లడం జీర్ణించుకోలేకపోతున్నామని కన్నీరు పెట్టారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. 1998–99లో పదోతరగతి చదివిన స్నేహితులు తలోకొంత పోగుచేసి ఈ సాయం అందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెపెల్లి ప్రసాద్, రేమిడి శ్రీధర్, ఆకుల తిరుపతి, వెల్దె కపిల్, మిరియాల కుమార్, వంగర భాస్కర్, శంకర్, రాజు, యుగందర్, కమలాకర్, రమేశ్, కుమారస్వామి, ప్రకాశ్, రఘుతో పాటు తదితర బాల్యమిత్రులు పాల్గొన్నారు.


చేయూతనందిస్తున్న పదోతరగతి స్నేహితులు

నేడు ఉచిత వైద్య శిబిరం

కమలాపూర్ : మండలంలోని 60 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇండియన్ రెడ్‌క్రాస్ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కమ్యూనిటీహాల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులచే వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు కూడా ఉచితంగానే పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. రెడ్‌క్రాస్ మొబైల్ మెడికేర్ యూనిట్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణగౌడ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


రవీందర్

శాయంపేట : కుమార్తె పెళ్లికి చేసిన అప్పు తీర్చలేక మనస్థాపం చెంది మద్యం మత్తులో గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన పెద్దపెల్లి రవీందర్ (44) వ్యవసాయం చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా కుమార్తె వివాహానికి రూ.10లక్షల వరకు అప్పు చేశాడు. ఈ క్రమంలో అప్పు ఎలా తీర్చాలో తెలియక మద్యానికి బానిసయ్యాడు. భార్య శ్రీదేవి పనిచేసి అప్పు తీర్చుదామని ధైర్యం చెప్పినా వినిపించుకోకుండా మద్యం మత్తులో ఆదివారం మధ్యాహ్నం ఇంటి వద్ద గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌ని ఓ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ రవీందర్ సోమవారం మృతిచెందినట్లు ఆయన తెలిపారు. మృతుడి భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో ఈనెల 19వ తేదీన ప్రారంభమైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పెద్ద రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాలాదారులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పెద్ద రథాన్ని లాగి తమ భక్తిశ్రద్ధలను చాటుకోగా, స్థానిక రైల్వే స్టేషన్ నుంచి వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు పురవీధుల గుండా సాగిన రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, లక్ష్మణాచార్యులు, హరీషాచార్యులు, శ్రీనివాసాచార్యులు, హనుమాన్ మాలధారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి


శాయంపేట : అవగాహన కల్పిస్తున్న ఏఓ


ఐనవోలు : రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న ఏఓ

శాయంపేట : మండలంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఏఓ గంగాజమున అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను, విత్తనాలను, ఎరువులను పరిశీలించారు. అనంతరం విత్తనాల కొనుగోలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం రసీదు తీసుకోవాలన్నారు. లైసెన్స్ కలిగిన డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, అనామకుల వద్ద కొనుగోలు చేయెుద్దని సూచించారు. బిల్లును జాగ్రత్తగా దాచిఉంచాలని అన్నారు. గ్రామాల్లో విడివిత్తనాలు లేదా నకిలీ విత్తనాలు విక్రయించినట్లు అనుమానమోస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఐనవోలు: మండలంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు విత్తనాలను ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ అడప కవిత హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని కీర్తి, లక్ష్మీ, ఓమ్ శ్రీ, మమత, అన్నపూర్ణ విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను క్షుణ్ణంగా పరిశీలించారు. పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.864 అని చెప్పారు. అంత కంటే ఎక్కువ ధరకు విక్రయించొద్దని సూచించారు. కృత్రిమ కొరత సృష్టించే అవకాశం లేదని, ఏ డీలరైనా అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన చట్టంకు లోబడి విత్తనాలు విక్రయించాలని ఈ సందర్భంగా డీలర్లకు సూచించారు.

ప్రణవ్‌పై అసత్య ప్రచారాలు సరికాదు

కమలాపూర్ : కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌పై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని మండలంలోని శంభునిపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొల్లం రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రణవ్‌పై జమ్మికుంట మండలానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు చేసిన అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. మచ్చలేని ప్రణవ్ లాంటి వ్యక్తులు రాజకీయాల్లోకి రావడం చాలా అరుదని, అలాంటి వ్యక్తిపై బురదజల్లే ప్రయత్నం చేయడం హేయమైన చర్యని తెలిపారు. నిరాధారణ ఆరోపణలు చేసిన వారిపై పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకుని సస్పెండ్ చేయడాన్ని స్వాగతిస్తామని ఆయన తెలిపారు. స్వంత పార్టీవారే లేనిపోని ఆరోపణలు చేస్తే పార్టీ అధిష్టానం చూస్తు ఉండదని హెచ్చరించారు. ప్రణవ్‌ను టార్గెట్ చేసి లేనిపోని ఆరోపణలు చేస్తున్న వారికి గుణపాఠం తప్పదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.